E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 02-03-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:60|| పేజీలు–6 www.ekaburu.com

## చెలరేగిన సంజు శాంసన్..
## సెమీస్‌కు దూసుకెళ్లిన టీమ్‌ఇండియా



....(మిగతా6లో)

# ఇరాన్‌పై 1200 బాంబులు

## .ఖమేనీ భేటీపై పక్కా సమాచారం.. తొలి టార్గెట్ ఆయనే..!
### – రక్షణ మంత్రి అజీజ్ మృతి

ఈ కబురు : ఇజ్రాయెల్, అమెరికా చేపట్టిన సంయుక్త దాడుల్లో ఇరాన్ రక్షణ శాఖ మంత్రి జనరల్ అజీజ్ నసీర్జాదే, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అబ్దోల్ రహీమ్ మౌసావి సైతం మృతి చెందారు. ఇరాన్ రక్షణ మండలి సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన వైమానిక దాడిలో వీరు మరణించారని ఇరాన్ అధికారిక మీడియా ఐఆర్ఎన్ఏ ఆదివారం వెల్లడించింది. నసీర్జాదే మృతి చెందినట్లు ఇప్పటికే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా అధికారిక మీడియా ధ్రువీకరించింది.

సాయుధ దళాలకు చెందిన పలువురు కమాండర్లు కూడా మరణించారని, వారి పేర్లను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. మరోవైపు అమెరికాతో కలిసి చేపట్టిన సంయుక్త దాడుల్లో భాగంగా ఇరాన్‌పై శనివారం

....(మిగతా2 లో)

ఒక్కరోజే 1,200కి పైగా బాంబులను జారవిడిచినట్లు ఇజ్రాయెల్ వైమానిక దళం ప్రకటించింది. తమ దేశంపైకి ఇరాన్ 137 క్షిపణులు, 209 డ్రోన్లను ప్రయోగించిందని యూఏఈ రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయని తెలిపింది. దుబాయ్‌లో డ్రోన్ల శకలాలు ఇళ్లపై పడటంతో ఇద్దరు గాయపడ్డారు. ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌లో దాదాపు 40 భవనాలు ధ్వంసమయ్యాయి. 200 మంది నివాసితులను అధికారులు సురక్షితంగా తరలించారు.

**ఖమేనీ భేటీపై పక్కా సమాచారం.. తొలి టార్గెట్ ఆయనే..!**

ఇరాన్ అగ్రనేత ఖమేనీ కదలికలు.. షెడ్యూల్ పక్కాగా అమెరికా వద్ద ఉన్నట్లు తెలుస్తోంది.






## నేడు, రేపు శ్రీవారి ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు

ఈ కబురు, తిరుపతి: ఈ నెల 3న చంద్రగ్రహణం కారణంగా 2, 3వ తేదీలకు సంబంధించిన శ్రీవారి స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లను రద్దు చేసినట్లు తితిదే శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది.




## ఇజ్రాయెల్ భీకర దాడులు ..టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు!

ఈ కబురు : ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. భీకర దాడుల కారణంగా నగరంలో భారీ పేలుళ్లు సంభవించాయి. పేలుళ్ల ధాటికి భూమి కంపించడంతోపాటు పెద్దఎత్తున పొగలు అలుముకున్నాయి.

# అభివృద్ధిపై దృష్టి పెట్టండి
## ..రాజకీయ విమర్శలు మానుకోవాలి

- 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు అందిచా
- గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా : బండి సంజయ్

**ఈ కుబరు, సిద్దిపేట:**
కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా మెజార్టీ సీట్లు గెలిచినా, మేయర్ పదవి రాకుండా అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ....(మిగతా2 లో)



# ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం: ట్రంప్



- అమెరికా, ఇస్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి
- ఒకేసారి 48 మంది ఇరాన్ అగ్రనేతలను అంతం చేశామన్న ట్రంప్
- ఇస్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడుల పరంపర
- భారత్ నుంచి వెళ్లే 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు రద్దు

**ఈ కబురు** : "ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది.

టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

....(మిగతా2లో)

# తెలంగాణ రాష్ట్రం ఆత్మ 'కళలు'

- కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట
- దేవాలయాలు, టూరిజం, కల్చర్ తో కూడిన యాక్షన్ ప్లాన్ రూపొందించండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎల్బీ స్టేడియంలో ఘనంగా రామదాసు జయంతి ఉత్సవాలు



**ఈ కబురు, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలు, ఆ కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రామదాసు జయంతి ఉత్సవాలలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు, భద్రాచల రామదాసు అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు.

....(మిగతా2లో)



## తెలుగు వారందరూ అప్రమత్తంగా ఉండాలి
..ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

....(మిగతా2లో)

హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా..
## రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్

ఈకబురు, హైదరాబాద్:
హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణలో నడుస్తోంది ప్రజాపాలన కాదని, బుల్డోజర్ పాలన అని ఆరోపించారు.



....(మిగతా2లో)

అక్రమ వసూళ్లు..
## అధికార దుర్వినియోగం!

కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు
పీడీఎస్ బియ్యం అక్రమార్కుల నుంచి గౌస్ ఆలం డబ్బులు వసూలు చేస్తున్నారు
హోంగార్డుల బదిలీ కోసం రూ.కోటి తీసుకున్నారు
ఎస్ఎస్ ఫ్రైడ్ మాల్ యజమాని వద్ద రూ.25 లక్షలు వసూలు చేశారు



....(మిగతా2

# అర్హులైన పేదలకు ప్రభుత్వం అండ

భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులకు స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఈనెల 15 లోగా నిర్మాణానికి ముగ్గులు పోయిస్తాం: మంత్రి పొంగులేటి



ఈకబురు, , ఖమ్మం : 'ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. వీరికి ఇంటి స్థలంతోపాటు రూ.5 లక్షలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం. ఈ నెల 15 లోగా ఇళ్ల నిర్మాణానికి నాతోపాటు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా వచ్చి ముగ్గులు పోయిస్తాం. ఇళ్ల స్థలం ఇచ్చేందుకు అనువైన ప్రాంతాన్ని ప్రభుత్వ యంత్రాంగం పరిశీలిస్తోంది'. అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ లో ఆయనకు వెలుగుమట్ల బాధితులు తమ గోడు వినిపించారు. కొందరు ముఠాగా ఏర్పడి రూ.లక్షలు వసూలు చేసి తమను మోసం చేశారని వివరించారు. బాధితులతో మాట్లాడిన తర్వాత మంత్రి విలేకరులతో మాట్లాడుతూ..

....(మిగతా3లో)

అమరావతిలో
నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ
## ఏర్పాటు చేయండి



దేశంలోనే బెస్ట్ మోడల్‌గా రాజధానిలో జస్టిస్ సిటీ నిర్మాణం
మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం... కేసుల పరిష్కారం
మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

....(మిగతా3లో)

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు ..400లకు పైగా విమానాలు రద్దు

**ఈ కబురు, ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ సహా పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. ఈ నేథ్యంలో దేశవ్యాప్తంగా ఆదివారం 444 విదేశీ విమానాలను రద్దు చేసే అవకాశం ఉందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఎన్ని విమానాలు రద్దవ్వనున్నాయి, ఎన్ని ఆలస్యమవ్వనున్నాయనే విషయంపై విమానయాన సంస్థల అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటికే ఫిబ్రవరి 28న 410 దేశీయ విమానాలను రద్దు చేసినట్లు వెల్లడించింది.

....(మిగతా3లో)



# సిక్కులకు న్యాయం కోసం కృషి

### హింద్–ది–చదర్‌నుద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోదీ

నవీ ముంబై: సిక్కులకు గౌరవం, న్యాయం దక్కేలా కృషి చేసేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే, 1984లో ఇందిర మరణానంతరం సిక్కులపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ జరిపేందుకు తమ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. మూసివేసిన ఎన్నో కేసులను తిరిగి తెరిచి, విచారణ చేపట్టామని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరిహారం అందజేశామన్నారు. జాతీయ మైనారిటీ కమిషన్‌లో సిక్కులకు మరింత ప్రాముఖ్యతను కల్పించామన్నారు. గురు తేజ్ బహదూర్ అమరత్వం పొంది 350 ఏళ్లయిన సందర్భంగా ముంబైలోని ఖర్ఘార్‌లో ఆదివారం జరిగిన 'హింద్-ది-చదర్'ను ఉద్దేశించి ప్రధాని వర్చువల్‌గా మాట్లాడారు. అఫ్గానిస్తాన్‌లో పవిత్ర గురుగ్రంథ్ సాహిబ్ ప్రతులు, సిక్కు కుటుంబాల భద్రత ప్రమాదంలో పడగా ప్రభుత్వం తక్షణమే స్పందించి సురక్షితంగా స్వదేశానికి తరలించిందని గుర్తు చేశారు. అఫ్గాన్‌లో యాతనలు పడిన సిక్కులకు సీఏఏ ద్వారా పౌరసత్వం కల్పించామని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన సిక్కు కుటుంబాల పునరావాసానికి చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. వేలాది మంది సిక్కుల పేర్లను బ్లాక్ లిస్టు నుంచి తొలగించడంతోపాటు వీసా నిబంధనలను సడలించినట్లు ప్రధాని వివరించారు.



....(మిగతా2లో)

## అభివృద్ధిపై దృష్టి పెట్టండి ..రాజకీయ విమర్శలు మానుకోవాలి



ఇప్పటికైనా రాజకీయ విమర్శలు మానుకొని, కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం విజయనగర్ కాలనీలో ఆదివారం బండి సంజయ్ పర్యటించారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇటీవల ఏకగ్రీవమైన విజయనగర్ కాలనీ భాజపా గ్రామ సర్పంచ్ సాదుల అమూల్యకు రూ.10 లక్షల నిధులు అందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భాజపా బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవ సర్పంచ్‌లుగా గెలిపిస్తే.. ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు ఇస్తానని చెప్పినట్లు గుర్తు చేశారు. ఎంపీ నిధుల కింద తనకు వచ్చే రూ.5 కోట్లతో తన పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 5 జిల్లాల్లో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పారు. తన నియోజకవర్గ పరిధిలోని 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు ఇచ్చానని, తన జీతం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 15 వేల మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించానని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్‌లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని బండి సంజయ్ అన్నారు.

# ఇరాన్‌పై 1200 బాంబులు



ఈ సమావేశ సమాచారమే దాడులు చేసేలా అమెరికాను పురిగొల్పింది. నిఘా సంస్థ సీఐఏ కొన్ని నెలలుగా ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సమన్వయంతో ఖమేనీ కదలికలపై నిఘా ఉంచింది. ఖమేనీ పాలన భవనాల్లో ఒక చోట ఈ భేటీ జరగనున్నట్లు గుర్తించారు. దీంతో అక్కడే దాడి చేయాలని అమెరికా, ఇజ్రాయెల్ భావించాయి. కాకపోతే ఆ భవన ప్రాంగణాల్లో ఎక్కడ ఖమేనీ ఉన్నారో ఆ దేశాల వద్ద కచ్చితమైన సమాచారం లేదు. ఖమేనీ భేటీ కూడా శనివారం సాయంత్రం జరగాల్సి ఉన్నట్లు సమాచారం ఉన్నా.. ఆ తర్వాత దాని షెడ్యూల్ ఉదయానికి మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో దాడి సన్నాహాలను వేగవంతం చేశాయి.

--ఖమేనీ నివాసంపై 30 బాంబులు..

ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ నివాస కాంప్లెక్స్(లీడర్‌షిప్ హౌస్), సమీపంలో ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు 30 బాంబులతో దాడి చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. ఇరాన్ సైనిక, పౌర నాయకత్వాలు సంయుక్త సమావేశం నిర్వహిస్తే దాడి చేసేందుకు అమెరికా నిఘా సంస్థ కాచుకొని కూర్చొంది. ఇలాంటివి మూడు భేటీలు శనివారం జరగనున్నట్లు వాటికి ఉప్పందింది. వీటిల్లో ఖమేనీ లొకేషన్ కూడా కచ్చితంగా తెలిసింది. దీంతో తొలివిడతలోనే అమెరికాఇజ్రాయెల్ దళాలు ఆ ప్రాంతంపై విరుచుకుపడ్డాయి. అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్‌ను కూడా లక్ష్యంగా చేసుకొన్నా.. ఆయన ప్రాణాలతో బయటపడ్డారు.

--ఈ దాడులకు ఆంత్రోపిక్ ఏఐ..

ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐని వాడినట్లు వాల్‌స్ట్రీట్ కథనంలో పేర్కొంది. అనంతరం ఈ కంపెనీ టూల్స్‌ను ఫెడరల్ ఏజెన్సీల వినియోగంపై దశల వారీగా నిషేధం విధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. అయినా ఇంటెలిజెన్స్ అసిస్టెన్స్, లక్ష్యాలను గుర్తించడం, యుద్ధక్షేత్ర పరిస్థితులను అంచనావేయడం వంటి సేవలకు పెంటగాన్ వినియోగించింది. ఇప్పటికే పాలంటైర్, అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిపి ఆంత్రోపిక్ అమెరికా సైన్యానికి సేవలు అందిస్తోంది. అయితే.. అమెరికా రక్షణశాఖతో విభేదాల కారణంగా ఇటీవల ఆంత్రోపిక్‌ను ఫెడరల్ ఏజెన్సీల్లో వాడకంపై నిషేధం విధించారు. వెనెజువెలా అధినేత మదురోను అదుపులోకి తీసుకొనే వేళ కూడా ఆంత్రోపిక్‌ను వాడినట్లు తెలుస్తోంది. ఓపెన్ ఏఐ, గూగుల్, ఎక్స్‌ఏఐ కృత్రిమ మేధ సేవలను కూడా అమెరికా వాడుతోంది.

--తోమహాక్ క్షిపణలు.. ఆత్మాహుతి డ్రోన్లు..

అమెరికా తన అత్యాధునిక ఆయుధాలను ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో వాడినట్లు ఆ దేశ వార్ సెక్రటరీ పీట్ హెగ్సెత్ వెల్లడించారు. అమెరికా వాడిన వాటిల్లో స్టెల్త్‌జెట్‌లు కూడా ఉన్నాయి. ఈ దాడిలో తొలిసారి చౌకబారు వన్‌వే డ్రోన్లను అమెరికా రంగంలోకి దించడం గమనార్హం. ఇప్పటి వరకు ఇరాన్ ఈ తరహా డ్రోన్లను వాడుతూ వస్తోంది. ఇరాన్ చుట్టుపక్కల స్థావరాల నుంచి అమెరికా హిమార్స్ రాకెట్‌లను కూడా ప్రయోగించింది. సుదూరాల నుంచే లక్ష్యాలను ఛేదించే ఆయుధాలను కూడా రంగంలోకి దించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. అమెరికాలోని అరిజోనా ఫినిక్స్ కేంద్రంగా పనిచేసే స్పెక్ట్రెవర్క్స్ తయారు చేసిన LUCAS (లోకాస్ట్ అన్ మ్యాన్డ్ అటాక్ సిస్టమ్)ను ఈ దాడి కోసం రంగంలోకి దించారు. వీటి ఒక్కోదాని విలువ 35,000 డాలర్లు మాత్రమే. సెంట్‌కామ్ వీటి ఫొటోలను షేర్ చేసింది. సదరు కంపెనీ మాత్రం వీటి వినియోగంపై స్పందించలేదు. ఇక అమెరికా నమ్మకమైన ఆయుధం తోమహాక్ క్షిపణులను కూడా ఈ దాడుల్లో వాడారు. ఒక్కో క్షిపణి ఖరీదు 1.3 మిలియన్ డాలర్లు.

## తెలుగు వారందరూ అప్రమత్తంగా ఉండాలి

**ఈ కబురు, హైదరాబాద్ :**



ఇరాన్ తో పాటు గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తెలుగు ప్రజలను సురక్షితంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటుందని అన్నారు. ఇరాన్ మరియు ఇతర గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తున్నదని తెలిపారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఆయా దేశాల్లో ఉన్న భారత ఎంబసీలు, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. తెలంగాణ ప్రజల భద్రత రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం: ట్రంప్




అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

మరోవైపు, ఇరాన్ తన క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక 'యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్'పై దాడి చేశామని ప్రకటించుకుంది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ దరిదాపుల్లోకి కూడా రాలేదని కొట్టిపారేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌లో తాత్కాలిక పాలక మండలి ఏర్పాటైంది. అయతోల్లా అలిరెజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు.

ఈ యుద్ధ ప్రభావం సామాన్యులపైనా తీవ్రంగా పడుతోంది. పాకిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద జరిగిన నిరసనల్లో 9 మంది మరణించారు. యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో విమానయాన రంగం కుదేలయ్యింది. భారత్ నుంచి వెళ్లాల్సిన 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. రష్యా, చైనా ఈ దాడులను ఖండించగా... పరిస్థితి ఇంకా ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

## హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్



**. మూసీ బాధితులకు అండగా కేకే నగర్ ఫేజ్ 2 నుంచి మధుపార్క్ రిడ్జ్ వరకు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితర నేతలతో కలిసి కేటీఆర్ 'మూసీ దండియాత్ర' నిర్వహించారు. కాంగ్రెస్ అంటే.. మోసం అని తెలిసే నగర ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.**

**తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.3,866 కోట్లతో ఎస్టీపీలు నిర్మించడమే కాకుండా, ఒక్క ఇల్లు పడగొట్టకుండా ఉప్పల్ ప్రాంతంలో 5 కి.మీ మేర మూసీ సుందరీకరణ చేసినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాత్రం రెండు, మూడు ఇళ్లు ఉండొచ్చుగానీ, పేదవాడికి ఒక ఇల్లు ఉంటే కంటగింపు ఎందుకని మండిపడ్డారు. రూ.16వేల కోట్లతో డీపీఆర్ పూర్తయ్యే పనికి.. రూ.లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు. కమీషన్లకు ఎగబడి ప్రభుత్వానికి విలువ లేకుండా చేశారని దుయ్యబట్టారు. మధుపార్క్ రిడ్జ్ మాత్రమే కాకుండా మూసీ పొడవునా 55 కిలోమీటర్ల మేర లక్షాయాభై వేల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కోసం ఎంతవరకైనా కొట్లాడతామని అన్నారు.**

## తెలంగాణ రాష్ట్రం ఆత్మ 'కళలు'



ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను రాష్ట్ర అభివృద్ధి గురించి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలతో ప్రజలకు వివరించారు, ఆ కళారూపాల్లో ప్రజలు పాల్గొనడమే కాదు ప్రజలు స్పందించిన తీరు తనకు వ్యక్తిగతంగా తెలిసిన వ్యక్తిగా భవిష్యత్తులో సంగీత నాటక అకాడమీ విరివిగా కార్యక్రమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ముందుంటుందని, అవసరమైన ఆర్థిక అవసరాలను తీరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. నేలకొండపల్లిలో జన్మించిన గోపన్న తన భక్తితో, కీర్తనలతో భక్త రామదాసుగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆయన కట్టిన భద్రాచలం ఆలయం, రాసిన కీర్తనలు ప్రతి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఇటువంటి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. చైతన్యానికి కళలే ఆయువుపట్టని అన్నారు. తెలంగాణ గ్రామాల్లోని ప్రతి సమస్యకు కళారూపాల ద్వారానే పరిష్కారాన్ని, చైతన్యాన్ని తీసుకువచ్చిన చరిత్ర మనదని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. కేవలం వినోదం కోసమే కాకుండా, ప్రజలను జాగృతం చేసేందుకు కళలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, రాష్ట్రంలోని పురాతన ఆలయాలను కలుపుతూ.. పర్యాటకం, సంస్కృతి మేళవించిన ఒక ప్రత్యేక 'యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని సంగీత నాటక అకాడమీని ఆయన ఆదేశించారు. కళల పట్ల ప్రజలకు ఉన్న మక్కువ చూస్తుంటే సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.

# సిక్కులకు న్యాయం కోసం కృషి




భవిష్యత్తుకు బాటలు పరిచేవి..

హింద్-ది-చాదర్ వంటి కార్యక్రమాలు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడానికి కాకుండా భవిష్యత్తుకు దారులు వేస్తాయన్నారు. 'గురు తేజ్ బహదూర్ కాలంలో ధైర్యం, సత్యసంధతకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో, నేటికీ అంతే సందర్భోచితంగా ఉంది. మన కొత్త తరం ఇటువంటి విలువలని అందిపుచ్చుకున్నప్పుడు, సంప్రదాయం అనేది కేవలం ఒక జ్ఞాపకంలా మిగిలిపోదు; అది భవిష్యత్తుకు మార్గదర్శకంగా మారుతుంది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం కూడా ఇదే. మనం చరిత్రను కేవలం స్మరించుకోవడమే కాదు, దానిని మన జీవితాల్లోకి కూడా తెచ్చుకోవాలి'అని ప్రధాని మోదీ తన వర్చువల్ ప్రసంగంలో పేర్కొన్నారు.

మన గురువుల త్యాగాలు..

దేశ చరిత్ర పరాక్రమం, సమన్వయం మరియు సహకారంతో నిండి ఉందని ఆయన అన్నారు. గురువుల అత్యున్నత త్యాగం దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసిందని ప్రధాని చెప్పారు. సమాజంలోని ప్రతి వర్గం వారి నుంచి స్ఫూర్తిని పొందిందని, అది సమాజం సత్య మార్గంలో ముందుకు స్థిరంగా సాగడానికి సాయపడిందని ప్రధాని తెలిపారు. 'దేశానికి సామాజిక ఐక్యత ఎంతో అవసరమైన ఈ సమయంలో, మన గురువులు, సాధువుల ఆశీస్సులు మనకు ఉన్నాయనే నమ్మకాన్ని ఈ కార్యక్రమం కలిగిస్తోంది. ఈ ప్రయాణం గత ఏడాది నాగ్‌పూర్ నుంచి ప్రారంభమైంది, ఆ తర్వాత నాందేడ్ వరకు సాగింది. నేడు నవీ ముంబైలో ఈ ప్రయాణం ఒక ముఖ్యమైన దశకు చేరుకుంది'అని ప్రధాని అన్నారు.

## ఇజ్రాయెల్ భీకర దాడులు ..టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు!



పేలుళ్లు సంభవించిన ప్రాంతానికి సమీపంలోనే ఇరాన్ పోలీసు హెడ్‌క్వార్టర్స్, అధికారిక టెలివిజన్ కార్యాలయం ఉన్నాయి. సెంట్రల్ టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. యుద్ధం మొదటి రోజు.. టెహ్రాన్‌ను చేరుకునే మార్గంలోని అడ్డంకులను తొలగించామని, రెండో రోజు కీలక ప్రాంతాల్లో దాడులు చేస్తున్నామని తెలిపింది.

**చమురు ట్యాంకర్‌పై దాడి.. అందులో భారతీయ సిబ్బంది!**

హార్ముజ్ జలసంధిలో ఓ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగిందని ఒమన్ వెల్లడించింది. నలుగురు సిబ్బంది గాయపడ్డారని తెలిపింది. పలావు జెండాతో ప్రయాణిస్తున్న స్కైలైట్ అనే చమురు ట్యాంకర్ లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు చెప్పింది. అందులో భారత్, ఇరాన్‌కు చెందిన సిబ్బంది ఉన్నారని పేర్కొంది. అయితే, దీనిపై ఎవరు దాడికి పాల్పడ్డారో తెలియరాలేదు. మరోవైపు ఇరాక్‌లోని ఓ మిలిటెంట్ గ్రూప్.. ఇర్బిల్‌లోని అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడి చేసింది.

# అక్రమ వసూళ్లు..అధికార దుర్వినియోగం!

ఈకబురు, హైదరాబాద్: కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పలు తీవ్ర ఆరోపణలు చేశారు. అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, 15 రోజుల్లో ఆయనపై చర్యలు తీసుకోకపోతే సీపీ చేస్తున్న అన్ని అక్రమాలకు సంబంధించిన ఆధారాలు వీడియోలతో సహా త్వరలో అసెంబ్లీ, మీడియా సాక్షిగా బయటపెడతానని హెచ్చరించారు. 'కరీంనగర్ సీపీ బచ్చాగాడు, ఆయన వయస్సు 40 యేండ్ల కంటే చిన్ననే..'అని వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు.



ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ వాహనాలా?

'పీడీఎస్ బియ్యం అక్రమార్కుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. 337 మంది హోంగార్డుల బదిలీ కోసం రూ.కోటి తీసుకున్నారు. ప్రభుత్వ వాహనాలు ప్రైవేటు వ్యక్తుల కోసం ఉపయోగిస్తున్నారు. టీఎస్ 09 పీఏ 4195 ఇన్నోవా వాహనాన్ని సీపీ గౌస్ ఆలం తన మిత్రుడు, ఐఆర్‌ఎస్ అధికారి వికాస్ అగర్వాల్ తండ్రి కోసం వినియోగిస్తున్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లు డ్రైవర్లుగా ఉన్నారు. టీఎస్ 09 పీఏ 5601 ఇన్నోవా కారు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం సోదరుడిని కాలేజీలో డ్రాప్ చేసేందుకు రోజు చలిమెడ వెళ్తుంది.

ప్రైవేటు పౌరుల కోసం ప్రభుత్వ వాహనాల వాడకంపై డీజీపీ శివధర్‌రెడ్డి సమాధానం చెప్పాలి. సీపీ సతీమణికి కరీంనగర్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఎలా వచ్చిందో తెలుసు. ఆమె కోసం ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు డ్యూటీ చేస్తున్నారు. ఇక ఆయన ఇంట్లో 20 మంది కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు..'అని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

వసూళ్ల కోసం ఏసీపీ, సీఐని పెట్టుకున్నారు..

'బియ్యం అక్రమార్కుల నుంచి డబ్బులు వసూలు చేయించేందుకు ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ సృజన్‌రెడ్డిని సీపీ పెట్టుకున్నారు. జనవరి 8న ఎస్‌ఎస్ ఫ్రైడ్ మాల్‌కు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆ మాల్ యజమాని దగ్గర నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారు. నేను చెప్పింది అబద్ధం అయితే నా ముక్కు నేలకు రాసేందుకు సిద్ధం. చర్యలు తీసుకోకపోతే వీడియోలు బయట పెడతా.

ఆ తర్వాత ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ బాధపడకూడదు. ఎందుకంటే నేను ఆ వీడియోలు బయట పెడితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. 15 రోజుల తర్వాత హుజూరాబాద్ ఏసీపీ, జమ్మికుంట సీఐ ఏమేం పనులు చేస్తున్నారో అన్నీ బయట పెడతా..'అని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు.

## నేడు, రేపు శ్రీవారి ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు



అంటే 3కి ముందు 1, 2వ తేదీల్లో తిరుపతిలో టోకెన్లు జారీ చేయరు. తిరిగి 4వ తేదీ దర్శనానికి సంబంధించిన టోకెన్లను 3న జారీ చేస్తారు. 3న వీఐపీ బ్రేక్ దర్శనాలు కూడా రద్దు చేయడంతో 2న ఆ సిఫార్సు లేఖలు స్వీకరించరు.

## అర్హులైన పేదలకు ప్రభుత్వం అండ




వీరు కాకుండా అర్హులైన పేదలందరికీ ఖమ్మం పరిసర ప్రాంతాల్లో, వారి సొంత ప్రాంతాల్లో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, విద్యుత్, తాగునీటి సౌకర్యం, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల కూడా నిర్మిస్తామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో ఇదంతా 15 రోజుల్లోగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు చెప్పామన్నారు.
కొంత మంది యూట్యూబర్‌లు, పనిగట్టుకొని కొన్ని పేపర్లు ఇదేదో తాము కావాలని చేస్తున్నామని, ఈ భూములతో డబ్బులు పోగేసుకుని ఎక్కడో ఎన్నికలకు వాడతామని దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మంత్రి వెంట ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, మట్టా దయానంద్ ఉన్నారు.
నగలు తాకట్టు పెట్టి డబ్బులిచ్చాం.. ఇప్పుడు రోడ్డున పడ్డాం
బాధితురాలు రజియా తన కష్టాలను మంత్రి పొంగులేటికి చెప్పుకుంది. వివరాలు ఆమె మాటల్లోనే.. మాది చింతకాని మండలం రేపల్లెవాడ. భూదాన భూముల్లో గుడిసెలు వేసుకొని ఎనిమిదేళ్లుగా ఉంటున్నాను. నా భర్త డ్రైవర్, నేను స్కూల్‌లో ఊడ్చే పనికి వెళతాను.
మాకు ఉండటానికి గూడు లేక, నా అమ్మమ్మ నగలను బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.3.60 లక్షలు భూదాన్ భూముల్లో ఉన్న కృష్ణ, రామచంద్రయ్యకు ఇచ్చాను. కరెంట్ లేకపోయినా సెల్ ఫోన్ లైట్లు, దీపాల వెలుగులో బతికాం. వారు చెప్పిన మాటలు విని డబ్బులు ఇచ్చాం. ఇప్పుడు ఇళ్లు కూల్చివేశారు. ప్రభుత్వం మమ్ములను ఆదుకోవాలి.

# అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి







ఈ కబురు ;
అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నేతృత్వంలో ఆదివారం విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు. సదస్సుకు వచ్చిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సీఎం చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'రాజధాని నిర్మాణంలో జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథార్టీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్శిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి వాటిని ఇంటిగ్రేట్ చేస్తూ బెస్ట్ జ్యుడిషియల్ సిటీని నిర్మిస్తాం. వీటికి అవసరమైన భూములు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం... ఈ అకాడమీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం. అమరావతిలోని జస్టిస్ సిటీని దేశంలోనే బెస్ట్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మేం ప్రయత్నిస్తున్నాం... దీనికి సీజేఐ సహకారం కావాలి. గ్రామాల్లో మధ్యవర్తిత్వం ద్వారా చాలా సమస్యలను పరిష్కరించేవారు... మా తండ్రి కూడా పెద్దరికం వహించి గ్రామంలో సమస్యలను పరిష్కరించారు. మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ.10 వేలు ఇస్తాం... కేసులు పరిష్కారం కాకున్నా రూ. 3 వేలు ఇస్తాం. కేసులు పరిష్కారమై సత్వర న్యాయం అందితే... త్వరితగతిన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ క్రమంలో మధ్యవర్తిత్వంతో పరిష్కారమైన కేసులకు రూ.10 వేలు ఇవ్వడం పెద్ద కష్టం కాదు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. బ్లూగ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం. ల్యాండ్ పూలింగ్ ద్వారా 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా రాజధానికి భూములు ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, పర్యావరణ హితంగా, ఆర్థికంగా బలమైన రాజధాని ఉండేలా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్లు తదితరులు హాజరయ్యారు.

## నాగ్‌పూర్‌లో భారీ పేలుడు ..17 మంది మృతి



ఈ కబురు : మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ (SBL) ఎనర్జీ లిమిటెడ్‌లో తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 17 మంది మృతిచెందగా.. 18 మంది తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు వెల్లడించారు. ఉదయం ఇందులోని ఒక యూనిట్‌లో అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని.. ఆ సమయంలో, 30 మందికి పైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారని తెలిపారు.

**--సీఎం ఫడణవీస్ దిగ్భ్రాంతి**

ప్రమాదంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని పేర్కొన్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని..గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపడతామని తెలిపారు.

## డీసీసీల అధ్యక్షులకు నేడు రాహుల్ క్లాస్

**సంస్థాగత నిర్మాణం, పార్టీ ఆలోచనల గురించి దిశానిర్దేశం**

**మాటామంతితో పాటు ఫొటో సెషన్లలో పాల్గొననున్న కాంగ్రెస్ అగ్రనేత**

**నేడు అనంతగిరిలో తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు**



**ఈ-కబురు, హైదరాబాద్**/వికారాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం రాష్ట్రానికి రానున్నారు. గత పది రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నారు. శిక్షణ తీసుకున్న డీసీసీ అధ్యక్షులకు పార్టీ సంస్థాగత నిర్మాణం, వారి విధులు, పార్టీ ఆలోచనల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. అక్కడే రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులను కలవనున్న రాహుల్ వారితో ఫొటో సెషన్‌లో పాల్గొననున్నారు. కాగా డీసీసీ అధ్యక్షుల కుటుంబ సభ్యులను కూడా ఈ శిబిరానికి ఆహ్వానించారు. వారితో కూడా మాట్లాడనున్న రాహుల్ ఫొటోలు సైతం దిగనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు పీఏసీ సభ్యులు, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, సంగతన్ సృజన్ అభియాన్ జాతీయ ఇన్‌చార్జి చల్లా వంశీ చందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, విశ్వనాథన్, సచిన్ సావంత్, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఏపీ నుంచి 41 మంది, తెలంగాణ నుంచి 36 మొత్తంగా 77 మంది డీసీసీ అధ్యక్షులు శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.
రాహుల్ షెడ్యూల్ ఇదీ..
పీసీసీ వర్గాలు వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 7:10 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరనున్న రాహుల్‌గాంధీ 9:20 నిమిషాలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, మంత్రులు, పార్టీ నేతలు స్వాగతం పలుకుతారు.
అక్కడి నుంచి ఉదయం 9:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరనున్న రాహుల్‌గాంధీ 10 గంటలరే వికారాబాద్‌కు వచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హరిత రిసార్ట్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4:30 గంటల వరకు శిక్షణ శిబిరంలో ఉంటారు. తిరిగి హెలికాప్టర్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని 5:30 గంటలకు ఢిల్లీ వెళ్తారు.



## ముప్పిడి సాంబయ్య లొంగుబాటు

ఈకబురు, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ ఒడిశా రాష్ట్ర కమిటీకి చెందిన ముప్పిడి సాంబయ్య అలియాస్ వికాస్ శనివారం రాత్రి లొంగిపోయారు. ఆయనతోపాటు మరో 14 మంది మావోయిస్టులు కూడా సాయుధ పోరుబాట వీడారు. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన బొలాంగిర్-బార్‌ఘడ్-మహాసముంద్ జిల్లాలతో కూడిన డివిజన్ కమిటీ లొంగిపోతామంటూ ఫిబ్రవరి 23న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మకు లేఖ రాసింది. తమ భద్రతకు హామీ ఇస్తే మార్చి 2 లేదా 3వ తేదీలోగా లొంగిపోతామని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ సర్కార్ నుంచి లొంగుబాటుకు గ్రీన్‌సిగ్నల్ రావడంతో ఫిబ్రవరి 28నే వికాస్ తన దళంతో కలిసి లొంగిపోయారు. ఇందులో సాంబయ్య ఒక్కరే తెలంగాణకు చెందినవారు కాగా మిగిలిన 14 మంది ఛత్తీస్‌గఢ్ వారు.
సంకోచించకుండా లొంగిపోండి..
లొంగుబాటు ప్రక్రియను సజావుగా జరిపించేందుకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మీడియా ప్రతినిధులు రంగంలోకి దిగా రు. వీరి ద్వారా శనివారం సాయంత్రం మహాసముంద్ జిల్లాలో అటవీ గ్రామమైన హర్‌తొండాకు 4 కి.మీ. దూరంలో ఒక వాగు ఒడ్డున ఉన్న పొలానికి మావోయిస్టులు చేరుకున్నారు. అక్కడి నుంచి మీడియా ప్రతినిధి ఫోన్ ద్వారా ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం విజయ్‌శర్మతో వికాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎలాంటి సంకోచం లేకుండా లొంగిపోవచ్చని విజయ్‌శర్మ తెలిపారు. ఆదివారం మహసముంద్ జిల్లాలో తన పర్యటన ఉందని, ఆ సమయానికి అక్కడకు చేరుకోవాలని సూచించారు. ఈ మేరకు ప్రయాణ ఏర్పాట్లకు సంబంధించి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని ఆయన వెల్లడించారు. మీ బృందంలో ఎంత మంది ఉన్నారు. ఎన్ని ఏకే 47లు తెచ్చారని విజయ్‌శర్మ ప్రశ్నించగా మొత్తం 15 మంది వచ్చామని, మూడు ఏకే 47లు తెచ్చామని సాంబయ్య బదులిచ్చారు.
ఖాళీ దిశగా ఒడిశా
మావోయిస్టు పార్టీకి దండకారణ్యం తర్వాత అతిపెద్ద బేస్‌గా ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలు ఉన్నాయి. అయితే గతేడాది జనవరిలో ఒడిశా సరిహద్దులో గరియాబంద్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతితోపాటు 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఆ తర్వాత జూన్‌లో జరిగిన మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఆంధ్రా-ఒడిశా బోర్డర్ జోన్‌కు నాయకత్వం వహిస్తున్న గాజర్ల గణేశ్ అలియాస్ ఉదయ్‌తో పాటు చైతే మృతి చెందారు. నవంబర్ 18న జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్‌లోనూ ఈ కమిటీ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. తర్వాత డిసెంబర్ 25న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒడిశా బాధ్యతలు చూస్తున్న కేంద్ర కమిటీ సభ్యుడు పాక హన్మంతు మరణించాడు. ఇలా వరుసగా ఒడిశాలో ఆ పార్టీ నష్టపోతుండగా తాజాగా బీబీఎం కమిటీ సైతం కనుమరుగైంది. చివరగా ఒడిశా కమిటీలో కలహండి-కందమాల్-బౌద్-నయాగఢ్ డివిజన్ కమిటీనే యాక్టివ్‌గా ఉంది. 12 మంది సభ్యులున్న ఈ కమిటీ కూడా జనవరి చివరి వారంలో లొంగిపోయే ప్రయత్నం చేసింది. ఈ కమిటీలో లొంగుబాటు ప్రయత్నాలు చేసిన అన్వేశ్ అనే మావోయిస్టును తోటి నక్సలైట్ సుక్రు చంపేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఈ కమిటీలోనూ తొమ్మిది మంది మావోలే మిగిలి ఉన్నారు.


## ఎన్‌డీడీబీ చేతికి మదర్ డెయిరీ

**సంస్థ ఆర్థిక కష్టాలను గట్టెక్కించేందుకు రంగంలోకి జాతీయ సంస్థ**

**15 రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం**

**ఎన్‌డీడీబీ చైర్మన్‌తో తెలంగాణ ప్రతినిధి బృందం భేటీ**

**అహ్మదాబాద్ వేదికగా డెయిరీ ఆర్థిక పరిస్థితిపై సమీక్ష**



ఈకబురు,, యాదాద్రి: మూసివేత తప్పని దశకు చేరుకున్న మదర్ డెయిరీ (నార్ముల్)ని ఆదుకునేందుకు జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ) రంగంలోకి దిగనుంది. ఈ డెయిరీ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడమే కాకుండా, కొంత కాలం నిర్వహణ బాధ్యతలు తీసుకునేందుకు కూడా బోర్డు సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ మేరకు ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ఎన్‌డీడీబీ, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం మధ్య చర్చలు సఫలమయ్యాయి.
ఎన్‌డీడీబీ చైర్మన్ డాక్టర్ మీనేశ్ షా, బోర్డు ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ జి. మధుసూదన్‌రెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మదర్ డెయిరీ సంస్థ ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. అలాగే డెయిరీని గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. నిర్వహణ బాధ్యతలు ఎన్‌డీడీబీ తీసుకోవాలని మదర్ డెయిరీ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రతినిధి బృందం బోర్డుకు అందజేసింది.

రూ.75 కోట్ల నిధులు అనివార్యం..: ప్రస్తుత పరిస్థితుల్లో డెయిరీని గట్టెక్కించాలంటే రూ.75 కోట్ల వరకు అనివార్యంగా నిధులు కావాలని, అలాగే సంస్థ నిర్వహణకు మరికొంత అవసరం అవుతాయని, ఈ పరిస్థితుల్లో ఎన్‌డీడీబీ సహకారం కావాలని, లేదంటే డెయిరీ మూసివేత ఒక్కటే మార్గమవుతుందని తెలంగాణ ప్రతినిధులు వివరించారు. డెయిరీలో పని చేస్తున్న ఉద్యోగులు, వారి వేతనాలు, పాల సేకరణ, బ్యాంకుల్లో తక్షణమే చెల్లించాల్సిన రుణాలు, కార్యకలాపాల పునరుద్ధరణ, పాలనా పరంగా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై కూలంకషంగా చర్చించిన అనంతరం కొన్ని షరతుల మీద మదర్ డెయిరీ నిర్వహణ బాధ్యతలు తీసుకునేందుకు ఎన్‌డీడీబీ అంగీకరించినట్టు తెలిసింది.

ఈ షరతులకు తెలంగాణ ప్రభుత్వం అంగీకరిస్తే జాతీయ స్థాయిలోని మరో డెయిరీతో కలిసి సంయుక్తంగా కొంతకాలంపాటు డెయిరీని నిర్వహిస్తామని ఎన్‌డీడీబీ స్పష్టం చేసింది. ఇందుకు అంగీకరించిన తెలంగాణ ప్రతినిధులు చర్చల పురోగతికి కూడా తమ సమ్మతిని తెలియజేశారు. దీంతో 10-15 రోజుల్లో మదర్ డెయిరీ, తెలంగాణ ప్రభుత్వం, ఎన్‌డీడీబీల మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ ఒప్పందం మేరకు ఎన్‌డీడీబీ రంగంలోకి దిగి ఆర్థిక కష్టాలు, అస్తవ్యస్త నిర్వహణతో కుదేలవుతున్న మదర్ డెయిరీకి మళ్లీ జీవం పోసే ప్రయత్నాలను ప్రారంభించనుంది.

## దౌర్జన్యంగా పేదల ఇళ్లు కూల్చేశారు ..రామచందర్‌రావు



ఈ కబురు, ఖమ్మం: నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా పేదల ఇళ్లను కూల్చివేశారని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఖమ్మం శివారు వెలుగుమట్లలోని భూదాన్ భూములను ఆయన పరిశీలించారు. భూ నిర్వాసితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో రామచందర్‌రావు మాట్లాడారు. ''భూదాన్ బోర్డు పట్టాలున్న పేదల ఇళ్లను కూల్చివేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. పేదల వ్యతిరేక ప్రభుత్వం. పేదల ఇళ్లు కూలగొట్టి ఏం సాధించారు?బాధితుల పక్షాన భాజపా పోరాడుతుంది. కూల్చిన చోట పేదలకు 100 గజాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే పేదలను పంపించేస్తున్నారు'' అని ఆయన ఆరోపించారు.

## విలువలతో కూడి రాజకీయాలు చేసిన వ్యక్తి వాజ్‌పేయి: వెంకయ్యనాయుడు

ఈ కబురు, ఖమ్మం: నేటి యువతరానికి అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం ఆదర్శప్రాయమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో నిర్వహించిన 'అటల్‌జీకి అక్షర నీరాజనం' పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసిన వ్యక్తి వాజ్‌పేయి అని వెంకయ్య కొనియాడారు. ఆయన్ను హృదయ సామ్రాట్‌గా పిలుచుకునేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. దేనినైనా మాటల్లో చెప్పకుండా చేతల్లో చేయడం ఆయనకే సాధ్యమన్నారు. రాజకీయ నాయకులు బూతులు మాట్లాడితే వారికి పోలింగ్ బూత్‌లలో సమాధానం చెప్పాలని వెంకయ్యనాయుడు సూచించారు. సిద్ధాంతాలను మరిచి రాద్ధాంతాలు చేసే రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. ఏ గాలికి ఆ అజెండా పట్టేవారిని ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, నిర్వాహకులు ప్రభాకర్ రెడ్డి, దుద్దుకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. 400లకు పైగా విమానాలు రద్దు

విమానాల రద్దు నేపథ్యంలో విమానాశ్రయాల్లోని టెర్మినల్స్ వద్ద ప్రయాణికులకు సహకారం అందించేందుకు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు పలువురు సీనియర్ అధికారులను నియమించినట్లు విమానయాన శాఖ తెలిపింది. ప్రయాణికుల ఫిర్యాదులను నమోదు చేయడానికి తాము ఏర్పాటు చేసిన డిజిటల్ ఫిర్యాదుల పరిష్కార వేదిక 'ఎయిర్‌సేవ'కు 216 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. వాటిలో 105 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ప్రయాణికుల భద్రత, కార్యాచరణ నిబంధనలను కచ్చితంగా పాటించేలా విమానయాన సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (DGCA) వెల్లడించింది. విమానాల మళ్లింపులు, రద్దు నేపథ్యంలో ప్రయాణికులకు తగిన సదుపాయాలు కల్పించాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు సూచించినట్లు తెలిపింది. మరో వైపు ఆదివారం సుదూర ప్రాంతాలకు వెళ్లే పలు అంతర్జాతీయ విమాన సర్వీసులను రద్దు చేసినట్లు దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా ప్రకటించింది. వీటిలో లండన్, షికాగో, టొరంటో, న్యూయార్క్, పారిస్ వంటి నగరాలు ఉన్నట్లు తెలిపింది. దోహా నుంచి వెళ్లాల్సిన అన్ని విమానాలను రద్దు చేసినట్లు ఖతార్ ఎయిర్‌లైన్స్ ప్రకటన విడుదల చేసింది.

**--విదేశీయులకు హోం మంత్రిత్వ శాఖ అడ్వైజరీ...**పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశంలోని విదేశీయులకు అడ్వైజరీ జారీ చేసింది. భారీగా విమానాలు రద్దవుతోన్న నేపథ్యంలో ప్రయాణాలకు అంతరాయం కలిగిన విదేశీయులు సమీపంలోని విదేశీయుల ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం (FRRO) నుంచి సహాయం తీసుకోవాలని సూచించింది. భారత్‌లో తమ వీసాలను పొడిగించుకోవడానికి, క్రమబద్ధీకరించుకోవడానికి అవసరమైన సహాయాన్ని అధికారులు అందిస్తారని తెలిపింది.

# ద్రవ్యలోటు

## రూ.9.8 లక్షల కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు జనవరి చివరికి (10 నెలల్లో) రూ.9.8 లక్షల కోట్లకు చేరుకుంది. పూర్తి ఆర్థిక సంవత్సం బడ్జెట్ అంచనాలో ఇది 63 శాతానికి సమానం. క్రితం ఆర్థిక సంవత్సరం జనవరి చివరికి ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 74.5 శాతంగా ఉండడం గమనార్హం.

2025–26 సంవత్సరం జీడీపీలో ద్రవ్యలోటు 4.4 శాతం (రూ.15.58 లక్షల కోట్లు)గా ఉంటుందన్నది బడ్జెట్ అంచనా. ఈ వివరాలను కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ప్రకటించింది. జనవరి చివరికి ప్రభుత్వానికి రూ.27.08 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో రూ.20.94 లక్షల కోట్లు పన్ను ఆదాయం కాగా, పన్నేతర రూపంలో రూ.5.57 లక్షల కోట్లు, రుణేతర మార్గాల్లో రూ.57,129 కోట్ల ఆదాయం సమకూరింది.



# ఊహకందని స్థాయికి చేరిన బంగారం ధర!

**బంగారం తగ్గుతుందని సంబరపడేలోపే.. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మొదలైపోయింది. దీంతో పసిడి ధరలు అమాంతం పెరిగిపోయాయి. గత ఆదివారం (ఫిబ్రవరి 22) రూ. 1,59,280 వద్ద ఉన్న గోల్డ్ రేటు (ఫిబ్రవరి 28) శనివారం నాటికి రూ. 1,68,710 వద్దకు చేరింది. ఈ కథనంలో వారం రోజుల్లో గోల్డ్ రేటు ఏ నగరంలో ఎలా ఉందనే వివరాలు వివరంగా తెలుసుకుందాం.**

హైదరాబాద్, విజయవాడలలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు.. వారం రోజుల్లో రూ. 1,59,280 నుంచి రూ. 1,68,710 వద్దకు (రూ.9430 పెరిగింది) చేరింది. 22 క్యారెట్ల తులం పసిడి రేటు రూ. 1,46,000 నుంచి రూ. 1,54,650 వద్దకు చేరింది. అంటే వారం రోజుల్లో 8650 రూపాయలు పెరిగిందన్నమాట. ఈ రోజు (మార్చి 1) ధరలు తెలుగు రాష్ట్రాల్లో గరిష్టంగా రూ. 1,73,080 వద్దకు చేరాయి.

చెన్నైలో గోల్డ్ రేటు వారం రోజుల్లో భారీగా పెరిగింది. ఫిబ్రవరి 22న రూ.1,60,150 వద్ద ఉన్న తులం 24 క్యారెట్ల బంగారం ధర రూ. 9490 పెరిగి.. ఫిబ్రవరి 28 నాటికి 1,69,640 రూపాయల వద్దకు చేరింది. 22 క్యారెట్ల బంగారం విషయానికి వస్తే.. ఇది 10 గ్రాములు 1,46,800 రూపాయల నుంచి రూ. 1,55,500 వద్దకు చేరింది. అంటే ఏడు రోజుల్లో 8700 రూపాయలు పెరిగిందన్నమాట.

## స్టాక్ మార్కెట్ సెలవులు..

# ట్రేడింగ్ బంద్



భారత స్టాక్ మార్కెట్లకు (ఎన్ఎస్ఈ, బీఎస్ఈ) మార్చి నెలలో వారాంతాలతోపాటు మూడు ప్రధాన సెలవులు ఉన్నాయి. ఈ సెలవులు హోలీ, శ్రీరామ నవమి, మహావీర్ జయంతి పండుగలకు సంబంధించినవి. మార్చి 3 (మంగళవారం) హోలీ సెలవు, మార్చి 26 (గురువారం) శ్రీరామ నవమి సెలవు, మార్చి 31 (మంగళవారం) మహావీర్ జయంతి సెలవుగా ప్రకటించారు. ఈ రోజుల్లో ఈక్విటీ, డెరివేటివ్స్, కరెన్సీ సెగ్మెంట్లలో ట్రేడింగ్ పూర్తిగా అందుబాటులో ఉండదు.

ట్రేడింగ్ ఏయే రోజుల్లో..

మార్చి నెలలో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సాధారణంగా సోమవారం నుంచి శుక్రవారం వరకు, శని, ఆదివారాలు,పైన పేర్కొన్న సెలవులు మినహా అందుబాటులో ఉంటుంది. మార్చిలో మొత్తం 31 రోజులు ఉండగా, మార్చి 1, 8, 15, 22, 29 తేదీల్లో ఆదివారాలు, మార్చి 7, 14, 21, 28 తారీఖుల్లో శనివారాలు వస్తాయి. వీటితోపాటు పండుగల సెలవులు పోగా మిగిలిన 19 రోజులు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంటాయి. ఇన్వెస్టర్లు తమ ట్రేడింగ్ షెడ్యూల్‌ను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ట్రేడింగ్ చేసే ఇన్వెస్టర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మార్కెట్ రీసెర్చ్: ఏదైనా స్టాక్ లేదా సెక్టార్‌లో ఇన్వెస్ట్ చేయడానికి ముందు పూర్తి అధ్యయనం చేయండి. కంపెనీ ఫండమెంటల్స్, మార్కెట్ ట్రెండ్స్, ఆర్థిక సూచికలను పరిశీలించండి.

రిస్క్ మేనేజ్‌మెంట్: మొత్తం మూలధనాన్ని ఒకే స్టాక్‌లో పెట్టకుండా, డైవర్సిఫికేషన్ చేయండి. స్టాప్‌లాస్ ఆర్డర్లు ఉపయోగించి నష్టాలను నియంత్రించండి.

ఎమోషనల్ డెసిషన్స్ వద్దు: మార్కెట్ హెచ్చు తగ్గులకు భావోద్వేగాలతో స్పందించకుండా, లాంగ్‌టర్మ్ వ్యూతో ఇన్వెస్ట్ చేయండి. ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్ (FOMO) లాంటి భావనలను నివారించండి.

ట్యాక్స్, రెగ్యులేటరీ అవగాహన: షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రూల్స్ తెలుసుకోండి. సెబీ రెగ్యులేషన్లకు అనుగుణంగా ట్రేడ్ చేయండి.

సెలవుల సమయంలో ప్లానింగ్: సెలవుల ముందు లేదా తర్వాత మార్కెట్ వాల్యూమ్ తక్కువగా ఉండవచ్చు, దీంతో వోలటాలిటీ పెరగవచ్చు. అందువల్ల ముందుగానే పొజిషన్లను అడ్జస్ట్ చేయండి.ఈ సెలవులు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయవచ్చు. కాబట్టి ఇన్వెస్టర్లు అప్‌డేటెడ్ ఇన్ఫర్మేషన్ కోసం ఎన్ఎస్ఈ, బీఎస్ఈ వెబ్‌సైట్లను చెక్ చేయాలి.

# ఇరాన్‌పై యుద్ధం.. కియోసాకి సంచలన ట్వీట్

బంగారం, వెండి, స్టాక్ మార్కెట్లు, బిట్ కాయిన్, క్రిప్టో కరెన్సీకి సంబంధించిన పరిణామాలు, పెట్టుబడులపై ఎప్పటికప్పుడు తర అభిప్రాయాలను, సమాచారాన్ని పంచుకునే ప్రముఖ ఇన్వెస్టర్, ప్రసిద్ధ ‘రిచ్ డాడ్ పూర్ డాడ్’ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి తాజాగా విభిన్న అంశంపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు.. దానికి ఇరాన్ ప్రతిదాడులతో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఆయన చేసిన సంచలన, వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృతంగా చర్చకు దారితీశాయి. కియోసాకి తన ట్వీట్‌లో తాను హనోయి (వియత్నాం రాజధాని)లో దిగిన సమయానికే ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఘర్షణలు మత, ఆర్థిక ప్రయోజనాలతో ముడిపడి ఉంటాయని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్ రక్షణ, చమురు ప్రయోజనాల అంశాలు కూడా యుద్ధాల వెనుక ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో జరిగిన వియత్నాం యుద్ధాన్ని ప్రస్తావిస్తూ, ఆ సంఘర్షణలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తాను ఆ యుద్ధంలో సహచరులను కోల్పోయానని భావోద్వేగంగా పేర్కొన్నారు. ప్రపంచం ఎప్పుడు శాంతి వైపు అడుగులు వేస్తుందో అంటూ నిట్టూర్చారు. ఇదే ట్వీట్‌లో అమెరికా రాజకీయాలపై కూడా కియోసాకి స్పందించారు. అమెరికా అధ్యక్షుడిగా జోబైడెన్ హయాంలో మొదలైన ఉక్రెయిన్‌రష్యా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అని ప్రశ్నించారు. ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలని పిలుపునిచ్చారు. తర్వాత చేసిన మరో ట్వీట్‌లో మిన్నెసోటా రాష్ట్ర రాజకీయాలపై వ్యాఖ్యానించారు.




కాంగ్రెస్ సభ్యురాలు ఇల్హాన్ ఓమర్, గవర్నర్ టిమ్ వాల్జ్ నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. సైకాలజిస్ట్, రచయిత జోర్డన్ పీటర్‌సన్ మాటలను ఉదహరిస్తూ, “బలహీన నాయకత్వం మరింత నష్టం కలిగిస్తుంది” అని పేర్కొన్నారు. అదే సమయంలో అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను (Donald Trump) “దృఢ నాయకుడు”గా అభివర్ణించారు.

# ఏఐప్లస్ స్మార్ట్ ఫోన్ నుంచి నోవాపాడ్స్



న్యూఢిల్లీ: ఏఐప్లస్ స్మార్‌ట్‌ఫోన్ సంస్థ తాజాగా ఏఐఓటీ విభాగంలోకి కార్యకలాపాలు విస్తరించింది. నోవాపాడ్స్, నోవావాచ్‌ని ప్రవేశపెట్టింది. ఇవి ఫిబ్రవరి 27 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంటాయి. నోవాపాడ్స్ ధర రూ. 699 నుంచి, నోవా వాచ్ ధర రూ. 2,499 నుంచి ప్రారంభమవుతుంది. అలాగే కొత్త తరం స్మార్‌ట్‌ఫోన్లయిన పల్స్ 2, నోవా 2 సిరీస్‌ని కూడా కంపెనీ ప్రకటించింది. మార్చ్ 2న పల్స్ 2ని, ఆ తర్వాత నోవా 2 సిరీస్‌ని ఆవిష్కరించనున్నట్లు తెలిపింది. పల్స్ 2లో 50 ఎంపీ ఏఐ డ్యుయల్ కెమెరా, 8 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆండ్రాయిడ్ 16 తదితర ఫీచర్లు ఉంటాయని పేర్కొంది.

# సిమ్ బైండింగ్‌పై ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధం



న్యూఢిల్లీ: వాట్సాప్, సిగ్నల్, టెలిగ్రాం లాంటి యాప్ ఆధారిత కమ్యూనికేషన్ సర్వీసులు తప్పనిసరిగా యాక్టివ్ సిమ్‌కార్డుతో లింక్ అయి ఉండాల్సిందేనంటూ (సిమ్ బైండింగ్) కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది టెలికమ్యూనికేషన్స్ చట్టాన్ని అతిక్రమించడమేనని, రాజ్యాంగవిరుద్ధమని టెలికం శాఖ కార్యదర్శి అమిత్ అగ్రవాల్‌కి ఫిబ్రవరి 23న రాసిన లేఖలో వ్యాఖ్యానించింది. దీని వెనుక గల అసలు కారణాలను తాము అర్థం చేసుకోగలమని, కాకపోతే నియంత్రణ సంస్థ జోక్యమనేది నిర్దిష్ట చట్టపరిధికి లోబడి ఉండాలని కోరుతున్నామని పేర్కొంది. మెటా, గూగుల్ లాంటి టెక్ దిగ్గజాలన్నీ బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరంలో సభ్యులుగా ఉన్నాయి. దేశ భద్రత రీత్యా సిమ్ బైండింగ్ నిబంధనలను మార్చే ప్రసక్తి లేదంటూ కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేసిన నేపథ్యంలో బీఐఎఫ్ లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

# మహీంద్రా 'సినీలక్స్' ఎడిషన్: 500 కి.మీ రేంజ్!

మహీంద్రా అండ్ మహీంద్రా.. తన XEV 9e కారును స్పెషల్ ఎడిషన్ రూపంలో 'సినీలక్స్' పేరుతో లాంచ్ చేసింది. ప్యాక్ త్రీ ట్రిమ్ ఆధారంగా నిర్మితమైన ఈ మోడల్ ధర రూ. 29.35 లక్షలు (ఎక్స్ షోరూమ్).

మహీంద్రా XEV 9e సినీలక్స్ స్పెషల్ ఎడిషన్ కోసం కంపెనీ మార్చి 2 నుంచి బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించనుంది. డెలివరీలు మార్చి 10న మొదలవుతాయి. శాటిన్ బ్లాక్ & శాటిన్ వైట్ రంగుల్లో లభించే ఈ కారు.. రెండు ఇంటీరియర్ థీమ్స్ పొందుతుంది. ఇది టాప్‌స్పెక్ ప్యాక్ త్రీ వేరియంట్‌లోని దాదాపు అన్ని ఫీచర్స్ పొందుతుంది. ట్రిపుల్‌స్క్రీన్ సెటప్, డాల్బీ అట్మాస్‌తో 16స్పీకర్ హర్మాన్ కార్డాన్ సౌండ్ సిస్టమ్, హెడ్‌అప్ డిస్ప్లే, 360డిగ్రీ కెమెరా & ఆటో పార్క్ అసిస్ట్‌తో ఏడీఏఎస్ మొదలైనవి ఉన్నాయి.

సినీలక్స్ ఎడిషన్ 79 kWh బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది, ఇది గరిష్టంగా 500 కి.మీ కంటే ఎక్కువ రేంజ్‌ను అందిస్తుంది. ఇది 282 బీహెచ్పీ & 380 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేసే ఎలక్ట్రిక్ మోటారుకు శక్తినిస్తుంది. కాబట్టి పనితీరు కూడా బాగుంటుందని సమాచారం.



# అదానీ గ్రీన్ ఎనర్జీకి నార్జెస్‌బ్యాంక్ గుడ్‌బై!

తమ పోర్ట్‌ఫోలియో నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ(ఏజీఈఎల్)ను తప్పించనున్నట్లు నార్వేకు చెందిన సావరిన్ వెల్త్ ఫండ్ నార్జెస్ బ్యాంక్ పేర్కొంది. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఇలాంటి ఆరోపణలతోనే 2024 మే నెలలోనూ సంస్థ అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ షేర్లను వదిలించుకుంది. నార్జెస్ బ్యాంక్ 2020 జూలైలో తొలిసారి ఏజీఈఎల్ షేర్లను కొనుగోలు చేసింది. షేరుకి రూ. 341 ధరలో వీటిని సొంతం చేసుకోగా.. ప్రస్తుతం షేరు రూ. 944 వద్ద కదులుతోంది. కాగా.. గతంలోనూ నార్వేజియన్ వెల్త్ ఫండ్ వివిధ కారణాలతో దేశీ బ్లూచిప్స్ ఐటీసీ, ఎల్అండ్‌టీ, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌టీపీసీ, వేదాంతాలను పోర్ట్‌ఫోలియో నుంచి తప్పించింది. మార్కెట్ గణాంకాల ప్రకారం 2025 ప్రారంభంనుంచి నార్జెస్ బ్యాంక్ 4.39 కోట్ల డాలర్ల విలువైన ఏజీఈఎల్ షేర్లను విక్రయించగా.. దేశీ మ్యూచువల్ ఫండ్స్ 50 కోట్ల డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.



# ఏటిగట్టున ఆఖరి పోరాటం



మహాభారతంలోని కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించేలా పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు తెలిపింది 'ఎస్.వై.జి (సంబరాల ఏటిగట్టు)' చిత్రబృందం. సాయిదుర్గా తేజ్ కథానాయకుడిగా... రోహిత్.కె.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. 'హను-మాన్'తో విజయాన్ని అందుకున్న నిర్మాతలు కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి సంయుక్తంగా ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిస్తున్నారు. ప్రస్తుతం పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. 35 రోజులపాటు రూ.20 కోట్ల వ్యయంతో ఆ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నట్టు తెలిపాయి సినీ వర్గాలు. "ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచాలనే లక్ష్యంతో విజువల్ హంగులతో, యుద్ధభూమిని తలపించేలా పతాక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం. ఈ సినిమాలో 18 పోరాటఘట్టాలు ఉంటాయి. స్టంట్ కొరియోగ్రాఫర్ కెవిన్ నేతృత్వంలో వాటిని తెరకెక్కిస్తున్నాం. సాయి దుర్గా తేజ్ ఓ సరికొత్త లుక్‌లో, తన కెరీర్‌లోనే ఎంతో క్లిష్టమైన పాత్రని ఇందులో చేస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో భారీస్థాయిలో చిత్రాన్ని విడుదల చేస్తున్నామ"ని నిర్మాతలు తెలిపారు. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల తదితరులు నటిస్తున్నారు.



# వరలక్ష్మి నటించడం శరత్‌కుమార్‌కు ఇష్టం లేదు.. కానీ: రాధిక

హైదరాబాద్: తన కుమార్తె వరలక్ష్మి (Varalaxmi SarathKumar) యాక్ట్ చేయడం నటుడు శరత్‌కుమార్‌కు తొలుత ఇష్టంలేదని రాధిక (Radhika) తెలిపారు. 'సరస్వతి' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ (Saraswathi Pre Release Event)లో నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. స్వీయ దర్శకత్వంలో వరలక్ష్మి నటించిన సినిమా ఇది. ఈ నెల 6న విడుదల కానున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. చిత్ర బృందంతోపాటు రాధిక, దర్శకురాలు నందిని రెడ్డి తదితరులు హాజరయ్యారు. రాధిక మాట్లాడుతూ.. "ఇక్కడ అమితానందంలో ఉన్న వ్యక్తి నా భర్తే (శరత్‌కుమార్) అని చెప్పగలను. నిన్న మేం ఇక్కడకు వచ్చే క్రమంలో.. విమానాశ్రయంలో కొందరు అభిమానులు కలిశారు. 'తాయ్‌కిళవి'లో బాగా నటించారండీ అంటూ నన్ను, 'ఆళి' మూవీ బాగుందంటూ మరొకరు శరత్‌కుమార్‌ను కొనియాడారు. భార్యభర్తల సినిమాలు ఒకే రోజు (ఫిబ్రవరి 27) విడుదల కావడం అరుదు. మరో మహిళ మా వద్దకు వచ్చి 'మీ కుమార్తె వరలక్ష్మి అంటే చాలా ఇష్టం' అని ప్రశంసించారు. ఆ క్షణం శరత్‌కు ఎంతో గర్వకారణం" అని రాధిక పేర్కొన్నారు.ఆయనకు ఇష్టంలేదు.. వరలక్ష్మి నటి కావడం శరత్ కుమార్‌కు తొలుత ఇష్టం లేదంటూ రాధిక సరదాగా వ్యాఖ్యానించారు. "వరలక్ష్మి సినిమాల్లోకి రావాలనుకున్నప్పుడు శరత్ వ్యతిరేకించారు. 'ఎలా నటిస్తావ్? నువ్వు యాక్ట్ చేయకూడదు' అంటూ సీరియస్ అయ్యేవారు. 'మా కుమార్తెను నటిగా ఎంపిక చేయొద్దు' అంటూ నిర్మాతలకూ ముందే చెప్పేవారు. ఈ విషయాలన్నింటినీ తన తల్లితో కలిసి వరలక్ష్మి ఓ రోజు నాతో పంచుకుంది. దీనిపై నిర్ణయం తీసుకోలేనని చెప్పి.. సినిమా సెట్స్‌లో ఉన్న శరత్ వద్దకు వారిని తీసుకెళ్లా. అప్పుడు ఆయన.. నమితతో కలిసి ఓ సాంగ్‌కు డ్యాన్స్ చేస్తున్నారు. మమ్మల్ని చూడగానే కారవాన్‌లోకి వెళ్లిపోయారు (నవ్వుతూ). తర్వాత వరలక్ష్మి నటించేందుకు అంగీకరించారు. వరలక్ష్మి తొలి సినిమా (పోడా పోడి)ని చూడగానే.. తను గొప్ప నటి అవుతుందని చెప్పా. తెలుగు సినిమాపై దృష్టి పెట్టమని వరలక్ష్మికి సలహా ఇచ్చా" అని రాధిక తెలిపారు.

# ఆమె బయోపిక్ చేయాలనుంది



వివిధ భాషల్లో హీరోయిన్‌గా రాణిస్తోంది ప్రియాంక మోహన్. ఒంద్ కథే హెల్లా అనే కన్నడ చిత్రంతో కథానాయికగా ఇండస్ట్రీలో అడుగుపెట్టింది బ్యూటీ. అదే ఏడాది నాని గ్యాంగ్ లీడర్ సినిమాతో తెలుగువారికీ పరిచయమైంది. ఆ వెంటనే డాక్టర్ చిత్రంతో తమిళ ప్రేక్షకులకు పరిచయమైంది. ఇలా తక్కువ కాలంలోనే మూడు భాషల్లో నటించే అవకాశాలను అందుకుని పక్కింటి అమ్మాయి ఇమేజ్ సొంతం చేసుకుంది.

**సినిమా**

అయితే ఈ బ్యూటీకి 2025 పెద్దగా కలిసి రాలేదు, సరైన హిట్ పడలేదు. అంతే కాకుండా ఇప్పుడు తన చేతిలో భారీ ప్రాజెక్టులు కూడా ఏమీ లేవు. ప్రస్తుతం తమిళంలో నటుడు కెవిన్ సరసన ఒక సినిమాలో నటిస్తోంది. కన్నడలో 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ అనే చిత్రంలో యాక్ట్ చేస్తోంది. మరోవైపు ఈమె ప్రధాన పాత్రలో నటించిన మేడిన్ కొరియా నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

**ఆమె బయోపిక్‌లో నటించాలనుంది**

ఇకపోతే ప్రతి నటికి ఏదో ఒక బయోపిక్‌లో నటించాలనే కోరిక ఉంటుంది. అలాంటి కోరిక మీకు ఏదైనా ఉందా? అన్న ప్రశ్నకు ప్రియాంక ఇలా స్పందించింది. దివంగత నటి సౌందర్య బయోపిక్‌లో నటించాలని ఉందని మనసులో మాట బయటపెట్టింది. కన్నడ నటి సౌందర్య.. మాతృభాషలో కన్నా తెలుగు, తమిళం భాషల్లోనే స్టార్ హీరోయిన్‌గా క్రేజ్ అందుకుంది. స్టార్ హీరోలందరితోనూ జోడీ కట్టింది. తక్కువకాలంలోనే మంచి పేరు తెచ్చుకుంది. అంతే తక్కువ కాలం లో విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైంది. మరి సౌందర్య బయోపిక్ తెరకెక్కిస్తారా? ఒకవేళ తీస్తే ప్రియాంకను హీరోయిన్‌గా తీసుకుంటారా? చూడాలి!

# ముత్తు వచ్చాడు మీ కోసం!



ఊర్లో వెతుకు.. అడవిలో వెతుకు.. సముద్రంలో కూడా చూడు.. ఎన్ని చోట్లా వెతికినా ఈ ముత్తు దొరుకుతాడు అనుకుంటున్నారా? అయినా మీరు అతని కోసం వెతకాల్సిన అవసరం లేదు.. ముత్తునే మీ కోసం వచ్చాడు" అని అంటున్నారు విజయ్ సేతుపతి. మరి ఈ ముత్తు ఎవరు? అతని కోసం అంతగా వెతకాల్సిన పనేంటి? అనేది తెలియాలంటే 'కట్టాన్' సిరీస్ చూడాల్సిందే. ఇటీవలే 'గాంధీ టాక్స్' లాంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిన విజయ్ ప్రధాన పాత్రలో ఎమ్.మణికందన్, బి.అజిత్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న సిరీస్ ఇది. తాజాగా ఈ సిరీస్ ఈ నెల 27న రాబోతున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది ఓటీటీ సంస్థ జియోహాట్‌స్టార్. 'ఒక పెట్టె.. ఒక రహస్యం' అనే వ్యాఖ్యను జోడించింది. రూరల్ యాక్షన్ డ్రామాగా ఈ సిరీస్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ముత్తు అలియాస్ కట్టాన్ పాత్రలో కనిపించనున్నారు విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఆయన ఖాతాలో 'స్లమ్ డాగ్', 'ట్రైన్'తో పాటు తదితర చిత్రాలున్నాయి.



# ఓటీటీలోకి 'విత్ లవ్'..

## రొమాంటిక్ కామెడీ మూవీ స్ట్రీమింగ్ ఎక్కడంటే?

టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషన్ జీవింత్ హీరోగా నటించిన తొలి సినిమా 'విత్ లవ్' (With Love). ఫిబ్రవరిలో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. 'నెట్‌ఫ్లిక్స్' (Netflix)లో ఈ నెల 6 (With Love Streaming date) నుంచి స్ట్రీమింగ్ కానుంది. రొమాంటిక్ కామెడీగా రూపొందిన ఈ సినిమాలో అనస్వర రాజన్ హీరోయిన్. మదన్ దర్శకత్వం వహించిన ఈ మూవీని రజనీకాంత్ కుమార్తె సౌందర్య నిర్మించారు. ఈ సినిమా కథేంటంటే?: సత్య (అభిషన్ జీవింత్) వాస్తుశిల్పి. కుటుంబ సభ్యులు తనకు పెళ్లి సంబంధాలు చూస్తుంటారు. అయితే ఆ అమ్మాయిల్లో సత్యకు ఎవరూ నచ్చరు. తీవ్ర ఒత్తిడి తీసుకురాగా ఎట్టకేలకు మోనీషా (అనస్వర రాజన్)ను కలిసేందుకు వెళతాడు. ఆమెతో మాటలు కలుపుతాడు. ఆ క్రమంలో.. తాము ఒకే పాఠశాలలో చదువుకొన్నట్లు తెలుస్తుంది. నాటి తీపి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ.. తమ స్కూల్‌ని సందర్శించడంతోపాటు స్నేహితులను కలవాలనుకుంటారు. సత్య ఓ అమ్మాయిని, మోనీషా ఓ అబ్బాయిని మీట్ అయ్యేందుకు అమితాసక్తి చూపిస్తారు. మరి, వీరి మధ్య అనుబంధం ఎలాంటిది? అసలు బాల్య మిత్రులను మీట్ కావాలన్న సత్య మోనీషాల ప్లాన్ వర్కౌట్ అయిందా? వీరిద్దరు ఒక్కటయ్యారా? అన్నది మిగతా కథ.

# తనయుడి సినిమాపై సునీల్ శెట్టి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

బాలీవుడ్ సీనియర్ నటుడు సునీల్ శెట్టి తన కుమారుడు అహాన్ శెట్టి నటించిన 'బోర్డర్ 2' సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల గ్రాస్ వసూలు చేసే వరకు తాను చూడనని, ఒక పంతం పెట్టుకున్నానని ఆయన స్పష్టం చేశారు. జనవరి 23న విడుదలైన ఈ సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ఇటీవల ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా సమ్మిట్ 2026'లో సునీల్ శెట్టి మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. 'దేశభక్తితో కూడిన ఈ సినిమా రూ.500 కోట్లు సాధించాలని నేను సినిమా రాకముందే గట్టిగా అనుకున్నాను. ఆ మార్క్ దాటిన తర్వాతే చూస్తానని మొక్కుకున్నా. ప్రస్తుతం సినిమా రూ.489 కోట్ల వద్ద ఉంది. మరో రూ.1011 కోట్లు ఒక తండ్రి ప్రేమ కోసం దేవుడు ఇస్తాడని ఆశిస్తున్నా' అని ఆయన భావోద్వేగంగా చెప్పారు. సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన 'బోర్డర్ 2' చిత్రం 1997లో వచ్చిన క్లాసిక్ ఫిల్మ్ 'బోర్డర్'కు సీక్వెల్‌గా తెరకెక్కింది. తొలి భాగంలో సునీల్ శెట్టి కూడా కీలక పాత్ర పోషించడం విశేషం. తన మొక్కు కారణంగా సినిమా ప్రీమియర్‌కు హాజరైనప్పటికీ, థియేటర్ లోపలికి వెళ్లకుండా బయటే ఉండిపోయానని సునీల్ శెట్టి



తెలిపారు. ప్రస్తుతం లక్ష్యానికి చేరువలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే ఆ మైలురాయిని దాటుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# "మోదీజీ కాపాడండి".. దుబాయ్ లో చిక్కుకున్న సోనాల్ చౌహాన్ విజ్ఞప్తి



పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలల ప్రభావం సెలబ్రిటీలపై కూడా పడింది. హాలిడే ట్రిప్ కోసం దుబాయ్ వెళ్లిన నటి సోనాల్ చౌహాన్.. యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో అక్కడే చిక్కుకుపోయారు. విమానాశ్రయాలు మూతపడటంతో ఆమె స్వదేశానికి తిరిగి వచ్చే మార్గం లేక ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియా వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి అత్యవసర విజ్ఞప్తి చేశారు. "గౌరవనీయ ప్రధాని మోదీ జీ.. ప్రస్తుత యుద్ధ సంక్షోభం కారణంగా నేను దుబాయ్‌లో చిక్కుకున్నాను. విమానాలు రద్దయ్యాయి, ఇంటికి రావడానికి వేరే దారి లేదు. దయచేసి నేను సురక్షితంగా భారత్ చేరుకోవడానికి సహకరించండి" అని ఆమె తన పోస్టులో కోరారు. కాగా, ఇప్పటికే భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా దుబాయ్ విమానాశ్రయంలోనే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. యుద్ధం కారణంగా అంతర్జాతీయ ప్రయాణాలు అస్తవ్యస్తం కావడంతో అక్కడ ఉన్న భారతీయులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# మీ ఇంటికి వచ్చి మీ అమ్మానాన్నను కలిసి మీ దుర్మార్గాలను ఎండగడతా: రేణుదేశాయ్ ఆగ్రహం

తన గురించి సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ చేసే ప్రతి ఒక్కరిని గుర్తించి, వారి ఇంటికి వెళ్లి మరీ వాళ్ల అమ్మానాన్నల ముందు నిలబెడతానని ప్రముఖ సినీ నటి రేణుదేశాయ్ అన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసుకుని నిత్యం అసభ్యపదజాలంతో ద్వేషించే వారు పెరిగిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తన ఇన్‌స్టా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు.

తాను విడాకులు తీసుకున్న దగ్గరి నుంచి కొంతమంది వివిధ రకాల కామెంట్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితం, తీసుకున్న భరణం, మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీ ఇలా దేనిని వదిలి పెట్టకుండా కామెంట్లు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో వీధికుక్కల అంశంపై తాను హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించానని గుర్తు చేశారు. ఓ ఎన్జీవో బృందం బలవంతంగా ఈ ప్రెస్ మీట్‌కు రప్పించిందని, ఆరోజు కూడా తాను పది చెడ్డ కుక్కల కోసం 90 మంచి కుక్కలను చంపడమేమిటని మాత్రమే ప్రశ్నించానని అన్నారు. దీంతో తనపై అసభ్యపదజాలంతో విరుచుకుపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత జీవితాన్ని ప్రస్తావిస్తూ ఇష్టారీతిన మాట్లాడారని అన్నారు. మీవాళ్లు మిమ్మల్ని ఇదే సంస్కారంతో పెంచారా అని ప్రశ్నించారు. మీరు చేసే పని మీ అమ్మానాన్నకు, అక్కాచెల్లెళ్లకు చూపించాలన్నారు. వీధి కుక్కల సంరక్షణ కోసం నేను ఎన్జీవోను పెట్టాను తప్ప మనుషుల కోసం కాదని గుర్తించాలని రేణూదేశాయ్ అన్నారు. కాబట్టి తనను తిట్టడానికి ఎవరికీ హక్కు లేదని అన్నారు. మరో ఘటనలో చిన్నపిల్ల చనిపోతే తన మాటలను ఎడిట్ చేసి ఆ ఘటనకు అటాచ్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మీలాంటి వారిని వెతుక్కుంటూ వచ్చి మీ అమ్మానాన్న వద్ద మీ దుర్మార్గాలను ఎండగడతానని హెచ్చరించారు. దిగజారిన వాళ్లు మాత్రమే మరో వ్యక్తిపై దారుణమైన కామెంట్లు చేస్తారని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యపదజాలం ఉపయోగించకూడదని రేణుదేశాయ్ విజ్ఞప్తి చేశారు.



## ఎయిర్‌పోర్ట్ పై దాడి..
## భయం భయంగా ఉంది: పీవీ సింధు




పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు రద్దు కావడంతో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు (PV Sindhu) దుబాయ్‌లో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. తాజాగా అక్కడి పరిస్థితులపై ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. తాము ఉన్న ప్రాంతానికి అతి సమీపంలోనే పేలుడు సంభవించిందని.. ప్రాణభయంతో అక్కడి నుంచి పరుగులు తీశామని పేర్కొన్నారు. ‘‘ఇక్కడి పరిస్థితులు గంట గంటకూ భయానకంగా మారుతున్నాయి. కొన్ని గంటల క్రితం విమానాశ్రయంలో మేము చిక్కుకున్న ప్రదేశానికి దగ్గరగా పేలుడు సంభవించింది. పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. నా కోచ్‌తో సహా అందరం భయంతో అక్కడినుంచి పరుగులు తీశాం. అది మా అందరికీ భయానక క్షణం’’ అని ఆమె రాసుకొచ్చారు. ప్రస్తుతం తామంతా క్షేమంగానే ఉన్నామని తెలిపారు. ఎయిర్‌పోర్టులోని సిబ్బంది, అధికారులు తమను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు వెల్లడించారు. తమ భద్రతకు చర్యలు తీసుకుంటున్న ఇక్కడి అధికారులతో పాటు దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బందికి సింధు ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడింది. ఈ క్రమంలో దుబాయ్‌లోని ఓ విమానాశ్రయం దెబ్బతింది.

## జింబాబ్వేపై విజయం..
## అగ్రస్థానంతో.. సెమీస్‌కు దక్షిణాఫ్రికా



టీ20 ప్రపంచ కప్ సూపర్ 8లోనూ దక్షిణాఫ్రికా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. దీంతో గ్రూప్ 1 నుంచి అగ్రస్థానంతోనే సఫారీ జట్టు సెమీస్‌లో అడుగు పెట్టింది. జింబాబ్వేతో జరిగిన సూపర్ 8 చివరి పోరులో దక్షిణాఫ్రికా ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే.. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. సికందర్ రజా (73) అదరగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 154 పరుగులు చేసింది. డేవాల్డ్ బ్రెవిస్ (42), రికెల్టన్ (31), జార్జ్ లిండె (30*), డేవిడ్ మిల్లర్ (22), ట్రిసన్ స్టబ్స్ (21*) రాణించారు. ఓపెనర్లు ఐడెన్ మార్క్రమ్ (4), క్వింటన్ డికాక్ (0) విఫలమయ్యారు. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా (3/29) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. అతడితోపాటు ముజరబాని, ఎవాన్స్ చెరో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా సికందర్ రజా నిలిచాడు. ఇప్పుడీ విజయంతో దక్షిణాఫ్రికా సెమీస్‌లో న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. మార్చి 4న కోల్‌కతా వేదికగా తొలి సెమీఫైనల్ జరగనుంది.

**రజా ఒక్కడే..**

అంతకుముందు జింబాబ్వే ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రజా ఆటే హైలైట్. సహచర బ్యాటర్లు విఫలమైన వేళ.. ఒంటరి పోరాటం చేశాడు. దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాడు. ఆఖర్లో క్లైవ్ మదాండె (26*) వేగంగా ఆడటంతో జింబాబ్వే స్కోరు 150+ దాటింది. బ్రియాన్ బెనెట్ (15), డియాన్ మయెర్స్ (11), మరుమాని (7), బర్ల్ (5), మున్యాంగా (2), బ్రాడ్ ఎవాన్స్ (8) నిరాశపరిచారు. సఫారీ బౌలర్లలో మఫాకా 2, బాష్ 2.. లిండె, ఎంగిడి, నోకియా తలో వికెట్ పడగొట్టారు.

# చెలరేగిన సంజు శాంసన్...
# సెమీస్‌కు దూసుకెళ్లిన టీమ్ఇండియా

- టి20 వరల్డ్ కప్ సూపర్8 పోరులో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచిన భారత్
- 196 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.2 ఓవర్లలోనే ఛేదించిన టీమిండియా
- 50 బంతుల్లో 97 పరుగులతో అజేయంగా నిలిచి ఒంటిచేత్తో గెలిపించిన సంజు శాంసన్
- మొదట బ్యాటింగ్ చేసి 195 పరుగులు సాధించిన వెస్టిండీస్
- మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్ ఆడనున్న భారత్




**ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈరోజు వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 196 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, సంజు శాంసన్ అద్భుత పోరాటంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో భారత్ మార్చి 5న ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌లో తలపడనుంది.**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు షై హోప్ (32), రోస్టన్ చేజ్ (40) శుభారంభం అందించగా, చివర్లో రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్) భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 76 పరుగులు జోడించడంతో విండీస్ భారీ స్కోరు సాధించగలిగింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి చెరో వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం 196 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఆరంభంలోనే తడబడింది. అభిషేక్ శర్మ (10), ఇషాన్ కిషన్ (10) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. అయితే వన్ డౌన్‌లో వచ్చిన సంజు శాంసన్ విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. వికెట్లు పడుతున్నా.. ఒకవైపు వికెట్ కాపాడుకుంటూనే, మరోవైపు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ యాదవ్ (18), తిలక్ వర్మ (27), హార్దిక్ పాండ్యా (17)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ముఖ్యంగా సూర్యతో కలిసి 58 పరుగులు, తిలక్‌తో కలిసి 42 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. చివరి వరకు క్రీజులో నిలిచిన శాంసన్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇన్నింగ్స్ 19.2వ ఓవర్‌లో మిడ్‌ఆన్ మీదుగా శాంసన్ కొట్టిన భారీ షాట్‌తో భారత్ విజయ తీరాలకు చేరింది. గెలిచిన వెంటనే మైదానంలో మోకాళ్లపై కూలబడి, ఆకాశం వైపు చూస్తూ దేవుడికి కృతజ్ఞతలు తెలిపాడు. సెంచరీకి కేవలం 3 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, జట్టును సెమీస్‌కు చేర్చానన్న ఆనందం అతనిలో కనిపించింది. చివర్లో శివమ్ దూబే (8 నాటౌట్) శాంసన్‌కు సహకరించాడు. ఈ విజయంతో గ్రూప్ 1 నుంచి భారత్ దర్జాగా సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది.




## వరల్డ్ కప్ నుంచి నిష్క్రమించిన
## కొద్ది గంటల్లోనే పాక్ క్రికెటర్ సంచలన నిర్ణయం



టీ20 వరల్డ్‌కప్ 2026 నుంచి పాక్ సూపర్8 దశలోనే నిష్క్రమించింది. నిన్న (ఫిబ్రవరి 28) తమ చివరి సూపర్8 మ్యాచ్‌లో శ్రీలంకపై గెలిచినా, న్యూజిలాండ్‌తో పోలిస్తే మెరుగైన రన్‌రేట్ లేని కారణంగా సెమీస్‌కు అర్హత సాధించలేకపోయింది. గ్రూప్2 నుంచి ఇంగ్లండ్ ఇదివరకే సెమీస్ బెర్త్ సాధించగా.. పాక్ శ్రీలంకపై గెలిచినా, మెరుగైన రన్‌రేట్ సాధించలేకపోవడంతో న్యూజిలాండ్ సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది.

మరోవైపు గ్రూప్1 నుంచి సౌతాఫ్రికా ఇదివరకే సెమీస్‌కు చేరుకోగా.. రెండో బెర్త్ కోసం భారత్, వెస్టిండీస్ పోటీపడుతున్నాయి. ఇరు జట్ల మధ్య ఇవాళ (మార్చి 1) రాత్రి జరుగబోయే మ్యాచ్‌లో ఏ జట్టు గెలుస్తుందో ఆ జట్టు సెమీస్‌కు చేరకుంటుంది. సెమీస్‌లో గ్రూప్1 టాపర్‌గా ఉన్న సౌతాఫ్రికా గ్రూప్2లో రెండో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్‌తో తలపడాల్సి ఉండగా.. వెస్టిండీస్, భారత్ మ్యాచ్‌లో విజేత గ్రూప్2 టాపర్ ఇంగ్లండ్‌తో సెమీస్‌లో తలపడుతుంది. ఇదిలా ఉంటే, పాక్ టీ20 ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన గంటల వ్యవధిలో ఆ దేశ దిగ్గజ స్పిన్నర్ అబ్దుల్ ఖాదిర్ కొడుకు, పాక్ మాజీ స్పిన్నర్ అయిన ఉస్మాన్ ఖాదిర్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 2024 అక్టోబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ఆయన, ఇప్పుడు మళ్లీ అన్ని ఫార్మాట్లలో ఆడేందుకు సిద్ధమని ప్రకటించాడు. ఉస్మాన్ ఖాదిర్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం పాకిస్తాన్ క్రికెట్‌లో సంచలనంగా మారింది. 32 ఏళ్ల ఉస్మాన్ ఖాదిర్.. అబ్రార్ అహ్మద్, షాదాబ్ ఖాన్ లాంటి వారు జట్టులోకి రాక ముందు పాక్ టీ20 జట్టులో రెగ్యులర్ సభ్యుడిగా ఉన్నారు. అయితే యువ స్పిన్నర్ల రాకతో అతనికి అవకాశాలు కరువయ్యాయి. దీంతో 2024లో రిటైర్మెంట్ ప్రకటించాడు. పాక్ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి వైదొలిగాక ఉస్మాన్ ఖాదిర్ తన మనసు మార్చుకున్నాడు. రిటైర్మెంట్ వెనక్కి తీసుకోవడానికి కారణాలు ఉస్మాన్ ఇటీవల ఆస్ట్రేలియాలో ఆడినప్పుడు 41 వికెట్లు తీశాడు. అలాగే స్థానిక లీగ్‌లలో ఓ మోస్తరు ప్రదర్శనలతో రాణించాడు. ఇంటాబయటా మంచి స్పందన రావడంతో ఉస్మాన్‌కు అంతర్జాతీయ వేదికపై తిరిగి రాణించగలనన్న నమ్మకం కలిగింది. కుటుంబ సభ్యులతో చర్చించిన తర్వాత, తన తండ్రి అబ్దుల్ ఖాదిర్ వారసత్వాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు. ఎక్స్ వేదికగా.. “నా ప్రయాణం ఇంకా ముగియలేదు. పాకిస్తాన్ క్రికెట్ కోసం మళ్లీ సిద్ధంగా ఉన్నాను” అని ప్రకటించాడు. తండ్రి తరహాలోనే రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్నర్ అయిన ఉస్మాన్ ఖాదిర్ పాక్ తరఫున 25 వన్డేల్లో 31 వికెట్లు.. ఒక వన్డే ఓ వికెట్ తీశాడు. 2020లో జింబాబ్వేపై టీ20తో

## మూడో వన్డే.. భారత్‌పై 185
# పరుగుల తేడాతో ఆసీస్ విజయం

హోబర్ట్: ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్‌ను 03తో భారత మహిళా జట్టు చేజార్చుకుంది. ఆఖరి వన్డేలోనూ ఘోర పరాజయం చవిచూసింది. హోబర్ట్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియాపై ఆస్ట్రేలియా 185 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 409 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన టీమ్ఇండియా 45.1 ఓవర్లలో 224 పరుగులకే ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్‌లో స్నేహ్ రాణా (44) టాప్ స్కోరర్. జెమీమా రోడ్రిగ్స్ (42) ఫర్వాలేదనిపించగా.. ప్రతీకా రావల్ (27), స్మృతి మంధాన (0), హర్మన్ ప్రీత్ కౌర్ (25), హర్లీన్ డియోల్ (14), రిచా ఘోష్ (18), కాష్వీ గౌతమ్ (0) విఫలమయ్యారు. ఆఖర్లో దీప్తి శర్మ (29)తో కలిసి స్నేహ్ రాణా కాస్త పోరాడింది. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 63 పరుగులు జోడించారు. ఆసీస్ బౌలర్లలో అలానా కింగ్ 4, జార్జియా 2.. నికోలా కారీ, ఆష్లే గార్డెనర్, అన్నాబెల్ సదర్లాండ్ తలో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హీలే నిలిచింది. అంతకుముందు టీ20 సిరీస్‌ను భారత్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వన్డే సిరీస్‌ను ఆసీస్ గెలుచుకుంది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ పెర్త్ వేదికగా మార్చి 6న ప్రారంభమవుతుంది.

**హీలే, బెత్ మూనీ శతకాలతో..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు శుభారంభం దక్కలేదు. మొదట్లో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేశారు. లిట్‌చ్‌ఫీల్డ్ (14) త్వరగా పెవిలియన్‌కు చేరినా.. అలీసా హీలే (158: 98 బంతుల్లో 27 ఫోర్లు, 2 సిక్స్‌లు), జార్జియా వోల్ (62) రెండో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. వోల్ ఔటైనప్పటికీ.. బెత్ మూనీ (106*: 84 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి హీలే దూకుడుగా ఆడేసింది. మూడో వికెట్‌కు 145 పరుగులు జోడించింది. వేగంగా ఆడే క్రమంలో హీలే పెవిలియన్‌కు చేరింది. భారత బౌలర్లు కాస్త పుంజుకొని ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. స్వల్ప వ్యవధిలో వికెట్లు తీశారు. కానీ, నికోలా కారీ (34*: 15 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి బెత్ మూనీ ఆసీస్ స్కోరును 400 పరుగులు దాటించింది. ఎనిమిదో వికెట్‌కు 54 పరుగులు జోడించడం గమనార్హం. భారత బౌలర్లలో శ్రీ చరణి (2/106), దీప్తి శర్మ (1/90), కాష్వీ గౌతమ్ (1/83) భారీగా పరుగులు సమర్పించగా.. రేణుకా ఠాకూర్ (1/64), స్నేహ్ రాణా (2/66) కాస్త ఫర్వాలేదనిపించారు.



## అమెరికాఇరాన్ యుద్ధం..
# క్రికెట్ సిరీస్ రద్దు





అమెరికాఇరాన్ యుద్ధ ప్రభావం క్రికెట్ ప్రపంచంపై కూడా పడింది. పాకిస్తాన్ షాహీన్స్‌తో (ఏ జట్టు) జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ లయన్స్ (ఏ జట్టు) రద్దు చేసుకుంది. ఈ సిరీస్ యూఏఈలోని అబుదాబీ వేదికగా జరుగుతుంది. అబుదాబీ నగరం ప్రస్తుతం ఇరాన్ దాడులతో అట్టుడికిపోతుంది.

అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ అమెరికా ఎయిర్‌బేస్‌ల్లో ఒకటైన అబుదాబీని టార్గెట్ చేసింది. శక్తివంతమైన బాలిస్టిక్ మిసైళ్లతో దాడులు చేస్తుంది. అక్కడే ఇంగ్లండ్ లయన్స్ జట్టు మరియు సపోర్ట్ స్టాఫ్ చిక్కుకుపోయారు. భారతకాలం ప్రకారం ఇవాళ (మార్చి 1) ఉదయం 11 గంటలకు ఇంగ్లండ్ లయన్స్‌పాకిస్తాన్ షాహీన్స్ మధ్య రెండో వన్డే జరగాల్సి ఉండింది. అయితే భద్రతా కారణాల వల్ల ఈ మ్యాచ్‌తో పాటు మిగతా సిరీస్ మొత్తాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. “జట్టు భద్రత మా ప్రాధాన్యత. పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నాం” ఈసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, ఇంగ్లండ్ లయన్స్‌పాకిస్తాన్ షాహీన్స్ మధ్య 3 టీ20లు, 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ అబుదాబీ వేదికగా షెడ్యూలైంది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో తొలుత టీ20లు జరగగా.. ఇంగ్లండ్ 30 తేడాతో ఆ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఫిబ్రవరి 27న జరిగిన తొలి వన్డేలోనూ ఇంగ్లండే విజయం సాధించి, 10 ఆధిక్యంలో ఉంది. ఈ సిరీస్‌లోని 3, 4, 5 వన్డేలు మార్చి 4, 6, 9 తేదీల్లో జరగాల్సి ఉంది.